## ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట, జూన్ 10 : కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గంటల ప్రతిపాదికన ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కాసిపేట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య తెలిపారు. ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టుల్లో బోధించేందుకు అనుభవం కలిగిన ఉపాధ్యాయులు కావాలన్నారు. పీజీటీ ఎకనామిక్స్ సబ్జెక్టు బోధించేందుకు ఎంఏ ఎకనామిక్స్‌తో పాటు బీఈడీ కలిగి ఉండాలని, పీజీటీ కామర్స్ బోధించేందుకు ఎంకామ్‌తో పాటు బీఈడీ కలిగి ఉండాలన్నారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు కాసిపేట తెలంగాణ మోడల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 9550932264 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలటౌన్, జూన్ 10: మంచిర్యాలలోని 132 కేవీ విద్యుత్ కేంద్రం పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 11న ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పట్టణంలోని రాంనగర్, కుందారం వాటర్ గ్రిడ్ 33కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ వేణుగోపాల్, ఏఈ సంధ్యారాణి తెలిపారు. దీంతో పట్టణంలోని రాంనగర్, కాలేజీరోడ్, ఎల్ఐసీ కాలనీ, రెడ్డికాలనీ, ఐబీ ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## నేడు తాగునీటి సరఫరా బంద్

మంచిర్యాలటౌన్, జూన్ 10: మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడ పాత రైల్వే గేటు వద్ద ఫీడర్ మెయిన్ పైపు, ఎల్లంపల్లి నుంచి వచ్చే పంపింగ్ మెయిన్ పైపు లైన్లు పగిలినందున, వాటి మరమ్మతుల కోసం ఈ నెల 11న పట్టణంలో తాగునీటి సరఫరా బంద్ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ తెలిపారు. పట్టణ ప్రజలందరూ సహకరించాలని కోరారు.

## నియామకం

నస్పూర్, జూన్ 10 : ఏబీవీపీ సౌత్ జోనల్ సోషల్ మీడియా కన్వీనర్‌గా మంచిర్యాలకు చెందిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి పెండెం సుమంత్ నియమితులయ్యారు. గుజరాత్‌లోని సూరత్‌లో జరిగిన నేషనల్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో సుమంత్‌ను నియమించారు. విద్యారంగ సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తానని సుమంత్ తెలిపారు.

## టీడీపీ పట్టణ కమిటీ ఎన్నిక

మందమర్రి, జూన్ 10: మందమర్రి పట్టణంలోని కార్యాలయంలో తెలుగు దేశం పార్టీ నూతన పట్టణ కమిటీని సోమవారం పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గం అధ్యక్షుడు బీ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా వాసాల సంపత్, తెలుగు మహిళా పట్టణ అధ్యక్షురాలిగా ఆర్.జయ, ప్రధాన కార్యదర్శిగా కారం రాజు, మహిళా ప్రధాన కార్యదర్శిగా జూపాక సంధ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ.షరీఫా, బూనేని సుగుణ, కృష్ణయ్య, బొట్ల స్వామి, శ్రీను, గొల్లపల్లి ఓదెలు, చాట్లపల్లి రాజేశ్, రంగనాథ్, రాజేశ్, గోపాల్, హబీబ్, నేరెళ్ల వెంకటేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు వెళ్లి.. గోదావరి గల్లంతై..

జైపూర్, జూన్ 10: మండలంలోని శివ్వారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బైరి మధూకర్‌గౌడ్ (54) సోమవారం గోదావరిలో గల్లంతై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం పెద్దపల్లి జిల్లా మంథనిలో సమీప బంధువులు చనిపోతే అంత్యక్రియలకు హాజరయ్యారు. అంత్యక్రియలు ముగియడంతో కుటుంబ సభ్యులు ఆటోలో వస్తుండగా తాను మాత్రం గోదావరి దాటితే శివ్వారం గ్రామం కావడంతో గోదావరి దాటుకుంటూ వెళ్లి గల్లంతయ్యాడు. రాత్రి వరకు గాలించినా ఆచూకీ దొరకలేదు. సోమవారం ఉదయం గోదావరిలో మృతదేహం తేలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మధూకర్‌గౌడ్‌కు భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్, 10: ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కాగజ్ నగర్ ఆర్డీవో కాశబోయిన సురేశ్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దాసరివేణు మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే దిశగా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

### వేమనపల్లి మండలంలో..


వేమనపల్లి : ప్రజావాణి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీవో


నెన్నెలలో దరఖాస్తు అందిస్తున్నఅర్జీదారుడు

వేమనపల్లి, జూన్ 10 : వేమనపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీవో శ్రీపతి బాపురావు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్జీలు రాలేదని తెలిపారు. సమస్యలుంటే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఐసీ కో ఆర్డినేటర్ సుజాత, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజలింగు, సీసీ శివరాం, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ, మండల అధికారులు పాల్గొన్నారు.

### ప్రజావాణికి అధికారుల గైర్హాజరు..

నెన్నెల,జూన్10: నెన్నెల మండల పరిషత్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది లేక ప్రజావాణి వెల వెలబోయింది. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మండలంలోని పలు శాఖల అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరు కావాల్సి ఉంది. కాని ఒకరిద్దరు మాత్రమే వచ్చి నామమాత్రంగా నిర్వహించారు. కరెంటు, గ్యాస్, భూ సమస్యలు, నీటి ఎద్దడి తదితర వాటిపై వచ్చిన ఫిర్యాదులన్నీ ఎంపీడీవోనే తీసుకున్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్, తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్, ఐకేపీ సీసీ వచ్చారు. మిగతా అధికారుల గైర్హాజరుపై ఎంపీడీవో దేవేందర్‌ను వివరణ కోరగా ఈ విషయం పై జిల్లా అధికారులకు నివేదిస్తానని చెప్పారు.

## సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

డీపీవో భిక్షపతి గౌడ్


మిషన్ భగీరథ ఆన్‌లైన్ నమోదుపై అవగాహన కల్పిస్తున్న డీపీవో

కౌటాల, జూన్ 10 : గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాపై వాస్తవ పరిస్థితులను మిషన్ భగీరథ యాప్‌లో నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టీ) మండలాల అధికారులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ సర్వేపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీరు సరఫరా అవుతున్నా, సరఫరా లేని ఇండ్ల వివరాలను మిషన్ భగీరథ ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ కార్డు వివరాలు, సెల్‌ఫోన్ నంబర్‌తో అన్ని వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు సత్యనారాయణ, ప్రసాద్, రమేశ్ రెడ్డి, ఎంపీవో మహేందర్ రెడ్డి, కృష్ణమూర్తి, ఏపీఎంలు దుర్గయ్య, ముక్తేశ్వర్, మోహన్‌లాల్, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

## ఇసుక టిప్పర్ పట్టివేత

జన్నారం, జూన్ 10 : మండలంలోని తపాలాపూర్ అటవీశాఖ చెక్ పోస్ట్ వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను అటవీశాఖ సిబ్బంది పట్టుకొని తహసీల్ కార్యాలయానికి తరలించి అప్పగించినట్లు తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి సోమవారం తెలిపారు. పట్టుబడిన ఇసుక టిప్పర్ యజమానికి రూ.15వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. వాగులు, గోదావరి రేవుల నుంచి అక్రమంగా ఇసుకను తరలించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఉత్తమ విద్యనందించడమే విద్యా భారతి ధ్యేయం

- విద్యాసంస్థల చైర్మన్ సురభి ఆగమరావు
- డిజిటల్ లెర్నింగ్ తరగతులు ప్రారంభం


కిష్టంపేట్‌లో విద్యాభారతి హైస్కూల్‌లో డిజిటల్ లెర్నింగ్ తరగతులు ప్రారంభిస్తున్న చైర్మన్ ఆగమరావు, డైరెక్టర్ శరత్‌కుమార్

తాండూర్, జూన్ 10 : విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించడమే తమ సంస్థ ధ్యేయమని విద్యాభారతి విద్యా సంస్థల చైర్మన్ సురభి ఆగమరావు, డైరెక్టర్ సురభి శరత్‌కుమార్ అన్నారు. విద్యా భారతి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలను ప్రారంభించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో సిల్వర్ జూబ్లీ వేడుకలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మండల నాయకులు, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బందితో కలిసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు, పోషకులకు, ఉపాధ్యాయులకు పలు సందేశాలను ఇచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు తక్కువ ఖర్చుతో మేధస్సు పెంచడం, ప్రతిభను వెలికి తీసేవిధంగా కార్పొరేట్ విద్యకు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలన్నారు. విద్యార్థులకు మరిన్ని స్కిల్స్ అందించేందుకు డిజిటల్ లెర్నింగ్ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు ఎంతోమంది విద్యార్థులు తమ పాఠశాలలో విద్యను అభ్యసించి మంచి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. సంస్థ లాభర్జన కోసం ఆశించకుండా నిరుపేద విద్యార్థుల కోసం కూడా తాము తమవంతుగా సహాయ సహకారాలను అందిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాలకు దీటుగా మన పాఠశాలలోఅన్ని వసతులతో, మెరుగైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వాసాల ప్రభాకర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత


పట్టుబడ్డ నకిలీ విత్తనాలు, నిందితుడితో పోలీసులు

భీమారం, జూన్ 10: భీమారం మండలకేంద్రంలోని ఆవడం క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు 107 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్, ఎస్ఐ ఉపేందర్, భీమారం ఎస్ఐ రాములు, వ్యవసాయ అధికారి మార్క్ గ్లాడ్సన్‌లు, సిబ్బంది ఉదయం ఆవడం క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహించి అనుమానాస్పదంగా మూడు సంచులతో ఆటో కోసం వేచి చూస్తున్న వ్యక్తిని పట్టుకుని తనిఖీ చేయగా 107 కిలోల నకిలీ విత్తనాలు లభించినట్లు తెలిపారు. పట్టుకున్న విత్తనాల విలువ రూ.3.20 లక్షలు ఉంటాయని తెలిపారు. పట్టుకున్న విత్తనాలు నిషేధిత బీటీ 3 గా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం కోయలవారిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి అని తెలిపాడు. ఈ విత్తనాలను చెన్నూర్ ప్రాంతంలోని అమాయక రైతులకు విక్రయించేందుకు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న విత్తనాలను తదుపరి విచారణ నిమిత్తం భీమారం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు.

## తలసేమియా వ్యాధి గ్రస్తుల కోసం రక్తదానం


రక్తదానం చేస్తున్న దాతలు

మంచిర్యాల ఏసీసీ, జూన్ 10 : మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో పింగిలి రచిత రెడ్డి ఆధ్వర్యంలో మందమర్రి పట్టణానికి చెందిన మాంటిస్సోరీ స్కూల్ 2012 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు స్పందించి తలసేమియా పేషెంట్ల కోసం రక్తదానం చేశారు. రక్తదాతలను ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. డొనేషన్ పత్రాలను రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్‌కు అందజేశారు. మరింత మంది దాతలు రక్తదానానికి ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్, తల సేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్, కంది సాయికుమార్, పోలు వర్షిత్, దుమ్మని శివ సాయిరాం, కొక్కెర శ్రీకాంత్, చిర్ల విక్రమ్, అనుదీప్, గిరినాల సాయికుమార్, అరిగొల్ల వెంకటేశ్, సాయి బాబా, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు

## మహిళలకు రక్షణ కల్పించాలి


మాట్లాడుతున్న ఐద్వా జిల్లా గౌరవ అధ్యక్షురాలురాజేశ్వరి

హాజీపూర్, జూన్ 10 : దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లయినా నేటికి మహిళలు, ఆడపిల్లలకు రక్షణ కరువైయిందని ఐద్వా జిల్లా గౌరవ అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని రాపల్లిలో జరిగిన మండల నూతన కమిటీ ఎన్నిక సమావేశానికి హాజరై మాట్లాడారు. మహిళల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా ఐద్వా కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. హాజీపూర్ మండల ఐద్వా గౌరవ అధ్యక్షురాలిగా పెంద్రం కళావతి, అధ్యక్షురాలు ఉగ్గే ఉమ, ప్రధాన కార్యదర్శిగా అర్చన, సహాయ కార్యదర్శిగా అనిత, కమిటీ సభ్యులుగా సులోచన, రాజుబాయి, నయిమున్నీసా,పద్మ, జయశ్రీ, స్వరూపను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పోతు విజయ, జిల్లా ప్రధాన కార్యదర్శి సంకె రజిత తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న బడిబాట


కొమ్మెరలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నూర్ రూరల్, జూన్ 10: చెన్నూర్ మండలంలో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టి 5 సంవత్సరాలు నిండిన పిల్లలను గుర్తించాలని చెన్నూర్ ఎంఈవో రాధాకృష్ణ మూర్తి అన్నారు. కొమ్మెర గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు సరళా దేవి, అంగన్ వాడీ టీచర్లు భూపతి రమాదేవి, సంగెం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### మందమర్రి మండలంలో..


పొన్నారంలో మాట్లాడుతున్న ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయురాలు

మందమర్రి రూరల్, జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని పొన్నారం గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ సునీత, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

## పాఠ్య పుస్తకాల పంపిణీ


పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో ప్రభాకర్

తాండూర్, జూన్ 10 : మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత నోట్ పుస్తకాలను సోమవారం ఎంఈవో వాసాల ప్రభాకర్ మండల విద్యా వనరుల కేంద్రంలో పంపిణీ చేశారు. ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని 6 నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

## మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

హాజీపూర్, జూన్ 10 : మండలంలోని టీకానపల్లికి చెందిన దాసరి సత్తయ్య (45) జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం సత్తయ్య మద్యానికి బానిసయ్యాడు. మానుకోవాలని పలుమార్లు చెప్పినా వినకపోవడంతో భార్య లక్ష్మి ఇద్దరు కుమారులతో పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపంతో సత్తయ్య సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు దాసరి చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### తిర్యాణి మండలంలో..

తిర్యాణి, జూన్ 10 : మంచిర్యాల జిల్లాలోని మందమర్రి మండలం ఊరు మందమర్రి గ్రామానికి చెందిన కూన చిన్నపోశం(58) ఆదివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తిర్యాణి ఎస్ఐ రమేశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కూన చిన్నపోశం ఊరు మందమర్రిలో కూలీ పని చేస్తున్నాడు. కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. శనివారం తిర్యాణిలో ఉండే అన్నదమ్ముల ఇంటికి వచ్చాడు. బహిర్భూమికి వెళ్తున్నానని చెప్పి ఆదివారం మనస్తాపానికి గురై భీమారం గ్రామ శివారులో గల చెలిమల వాగు ప్రాజెక్టు కుడి కాలువ సమీపంలో టేకు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నపోశం భార్య కూన విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## అనారోగ్యంతో అంగన్‌వాడీ ఆయా మృతి

సిర్పూర్(యు), జూన్ 10 : మండలంలోని పాములవాడలో అంగన్‌వాడీ ఆయాగా విధులు నిర్వహిస్తున్న కుడ్మేత మాల్కుబాయి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. ప్రభుత్వం ఐసీడీఎస్ శాఖ ద్వార తక్షణ సహాయంగా జైనూర్ ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరా రూ.10వేలు సోమవారం మల్కుబాయి కుటుంబ సభ్యులకు అందించారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయాలి

- మంచిర్యాల జిల్లా సెక్టోరల్ అధికారి సత్యనారాయణ


తాండూర్‌లో పనులు పరిశీలిస్తున్న సత్యనారాయణ

తాండూర్, జూన్ 10 : అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా సెక్టోరల్ అధికారి సత్యనారాయణ అన్నారు. తాండూర్‌లోని ఐబీలో ఎంపీపీఎస్ ఉర్దూ మీడియం, తెలుగు మీడియం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో పనులను సోమవారం ఎంఈవో వాసాల ప్రభాకర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. పాఠశాలల్లో కొనసాగుతున్న తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల మరమ్మతు పనులను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ నారాయణను ఆదేశించారు. మండలంలోని పాఠ్యపుస్తకాల గోదామును పరిశీలించిన సెక్టోరల్ అధికారి ఎంఈవోను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మార్సీ సీసీవో ప్రశాంత్, తదితరులున్నారు.

## అపరిచిత వ్యక్తుల కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి


యువకులతో మాట్లాడుతున్న ఏఎస్ఐ సత్తయ్య

సీసీసీ నస్పూర్, జూన్ 10: అపరిచిత కాల్స్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీసీసీ నస్పూర్ ఏఎస్ఐ సత్తయ్య సూచించారు. సోమవారం సాయంత్రం నాగార్జునకాలనీలోని సింగరేణి ప్రాణహిత స్టేడియంలో సైబర్ నేరాలపై యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు టెక్నాలజీ పెరిగిపోయి ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. అపరిచిత కాల్స్ వస్తే వెంటనే తిరస్కరించాలని సూచించారు. వ్యసనాలు, ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసై తమ జీవితాలను అంధకారం చేసుకోవద్దన్నారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజేందర్, కానిస్టేబుళ్లు పున్నం, బ్లూకోల్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ అప్పగింత

జన్నారం, జూన్ 10 : మండలంలోని పొనకల్ గ్రామానికి చెందిన కే మనోహర్ రావు చెందిన రూ.25 వేల విలువైన సెల్‌ఫోన్ పోయిందని మే 12న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రాజవర్ధన్‌కు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రాజవర్ధన్ సైబర్ క్రైమ్ ఇన్‌చార్జి పీసీ రవీందర్ సీఈఐఆర్ ఆధారంగా సెల్‌ఫోన్ ఆచూకీని కనుగొని స్వాధీనం చేసుకొని సోమవారం అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులకు మనోహర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థినికి అభినందనలు


యశస్వినిని సన్మానిస్తున్న వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకులు

చెన్నూర్, జూన్ 10: చెన్నూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన విద్యార్థిని తుమ్మల యశస్విని పదవ తరగతి పరీక్షల్లో 10/10జీపీఏ సాధించినందుకు ప్రతిభ పురస్కారాన్ని అందుకున్నది. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సోమవారం వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యశస్వినిని ప్రతిభ పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

## ప్రణయ్‌కి మహాత్మా జ్యోతిబా పూలే జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న ప్రణయ్ కుమార్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 10 : జిల్లాకు చెందిన బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు అవిడపు ప్రణయ్ సోమవారం మహాత్మాజ్యోతిబా పూలే అవార్డు అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో జూన్ 10వ తేదీన పూణేలోని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ సాంస్కృతిక భవన్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాటమ్మ రాంబాబు బహుజన సాహిత్య అకాడమీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాదే వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎంపీ, పీఎంపీపై దాడులను వెంటనే నిలిపివేయాలి



తహసీల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు

దహెగాం, జూన్ 10 : గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో కష్టానష్టాలను ఓర్చుకుంటూ ప్రజలకు సేవలందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులపై ఐఎంఏ, టీఎంసీలు దాడులను ఆపాలని ఆ సంఘం తాలుకా అధ్యక్షుడు జాడి దిలీప్‌కుమార్, మండల అధ్యక్షుడు లొనార్ మధూకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిరసన తెలిపి అనంతరం తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో నం 1273 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. దాడులకు నిరసనగా ఈ నెల 11వ తేదీ వరకు నిరసన ప్రదర్శనలు చేయడంతో పాటు తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కొమురవెల్లి ప్రశాంత్, శ్రీనివాస్, లక్ష్మణ్, అఖిల్, గోవింద్‌రాయ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానలో వేడి నీళ్లే దిక్కు..!


ఎండలో వాటర్ ఫ్రిజర్

కాగజ్‌నగర్, జూన్ 10: కాగజ్‌నగర్ పట్టణంలోని 30 పడకల సామాజిక ప్రభుత్వ దవాఖానలో వాటర్ ఫ్రీజర్ ఉన్నప్పటికీ వేడి నీళ్లే దిక్కవుతున్నాయి. విద్యుత్ సరఫరా నిలిపివేసి ఎండకు పెట్టడంతో తాగునీళ్లు వేడిగా ఉంటున్నాయని, రోగులు, వారి వెంట ఉండే సహాయకులు అంటున్నారు.